క్లుప్తంగా

యోగా సాధనతో మెరుగైన ఆరోగ్యం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆరోగ్య జీవనానికి యోగా సాధన ఏకైకమార్గమని ఏతా సత్యనారాయణ అన్నారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండపల్లి బీకాలనీ ఆడిటోరియంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆయన సోమవారం ప్రారంభించారు. 15 రోజుల పాటు జరిగే యోగా శిక్షణకు ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. దినచర్యలో యోగా ఒకభాగం చేసుకోవాలని ఆయన సూచించారు. సూక్ష్మ వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, ఆరోగ్య ముద్రలు, ప్రాణాయామం ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. యోగా గురువు లంకే జనార్దన్ యోగాసనాలు నేర్పించారు.

ఆర్అండ్బీ రోడ్డుపై గోతులు పూడ్చివేత



చాట్రాయి: మండలంలోని మంకొల్లు, పోలవరం ఆర్అండ్బీ రోడ్డుపై పడిన గోతులు ప్రయాణాలకు తీవ్ర అసౌకర్యంగా మారుతున్నాయి. ఈ మార్గం నుంచి చింతలపూడికి, విస్సన్నపేట, చాట్రాయి గ్రామాలకు నిత్యం వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రోడ్డుపై ఏర్పడిన పెద్ద గోతులు ప్రమాదాలకు నిలయంగా మారుతుండడంతో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ స్పందించి తన సొంత నిధులతో 200 మీటర్ల పొడవులో గోతులను పొక్లెయిన్తో పూడ్పించారు. గోతులను పూడ్పించడంపై వాహనచోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమృత వాటిక నిర్మాణానికి మట్టి సేకరణ



ఇబ్రహీంపట్నం: ఢిల్లీలో అమరవీరుల త్యాగాలకు చిహ్నంగా నిర్మిస్తున్న పవిత్ర అమృత వాటిక నిర్మాణానికి మట్టిసేకరణలో భాగంగా నామట్టి నాదేశం కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కిసాన్మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, నియోజకవర్గం ఇన్చార్జ్ కుక్కపల్లి నాగేశ్వరరావు పవిత్ర మట్టిని ప్రజల నుంచి సేకరించారు.

నేడు ఎస్జీఎఫ్ బాలుర ఆటల పోటీలు

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడి హైస్కూల్లో మంగళవారం ఎస్జీఎఫ్ బాలుర ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు పీడీ పీ రవీంద్ర తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, షటిల్, వాలీబాల్, టెన్నీకాయిట్, బాల్ బాడ్మింటన్, త్రోబాల్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆటల పోటీల నిర్వహణకు కోర్టులను సోమవారం సిద్ధం చేశామని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి ఈ ఆటల పోటీల్లో పాల్గొనాలని అన్నారు. పీడీలు స్వప్న, రాజేంద్రప్రసాద్, రాణి, ఆరతి, నాగమణి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పద్యనాటక పోటీ విజేతలు వీరే

విజయవాడ కల్చరల్: శ్రీదేవి కళానాట్యమండలి, గుమ్మడి జయరాజ్ కళాపీఠం, సాయి హృదయ నాట్యమండలి ఆధ్వర్యాన గాంధీనగర్లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పద్యగాన పోటీల విజేతలను నిర్వాహక సంఘ సభ్యులు గుమ్మడి జయరాజ్, అవినాష్ గుమ్మడి, అరుగు త్రినాథనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరుకు చెందిన తేళ్ల రామారావు ప్రథమ బహుమతి, ఎన్టీఆర్ జిల్లాలోని చందర్లపాడుకు చెందిన కస్తాలదుర్గారావుకు ద్వితీయ, పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన నీలం దుర్గారావు తృతీయ బహుమతి పొందారు. దొడ్డా మిషక్రాజు(కృష్ణా), కె.ఇక్రాల్(బాపట్ల), ముత్యాల నాగేశ్వరరావు (కృష్ణా), మరియదాసు(గుంటూరు), వి.వి.శివారెడ్డి(గుంటూరు)కి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వి.నారాయణ (మహబూబ్నగర్), పాణ్యం దత్తాశర్మ(హైదరాబాద్)కు ప్రత్యేక బహుమతులను ప్రకటించి నగదు బహుమతిని అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వేమూరి నాగేశ్వరశర్మ, సుబ్బరాజు, పుష్పాల ఆంజనేయులు, నిమ్మగడ్డ ఏసుపాదం వ్యవహరించినట్లు తెలిపారు.

రేపు అన్నాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాస శివరాత్రి పురస్కరించుకుని అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ఈనెల 13న శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యంలో స్వామికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు హేమసుందర వరప్రసాద్ సోమవారం తెలిపారు. స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్బీకేల పరిధిలో ప్రయోగాత్మకంగా పైర్ల సాగు

- ఒక్కో ఆర్బీకే పరిధిలో రెండు పైర్లు సాగు
- పైర్లపై రైతులకు పూర్తి అవగాహన
- క్రిమిసంహారక మందుల వినియోగంపై నియంత్రణ



కొణిజెర్లలో కందిపంటలో అంతరపంటగా కొర్రల సాగు

కొణిజెర్ల(గంపలగూడెం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి మెరుగైన సేవలు అందించడంతోపాటుగా నూతన పంటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రతి సచివాలయం పరిధిలో ఒక ఆర్బీకేను ఏర్పాటు చేసింది. ప్రతిఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుచేసే వివిధ రకాల పైర్లకు సంబంధించి రైతులకు సూచనల, సలహాలు ఇవ్వడంతోపాటుగా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, సబ్సిడీపై వ్యవసాయ, యంత్ర పరికరాలు అందజేస్తుండటంతో ఆర్బీకేలు రైతుల ఆదరణ పొందుతున్నాయి. ప్రతి ఆర్బీకేలో ఆ ప్రాంతంలో సాగు అయ్యే పంటల ప్రాతిపదికను గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ), లేదా గ్రామ ఉద్యానవన సహాయకులు(వీహెచ్ఏ)లను రాష్ట్ర ప్రభుత్వం నియామకం చేసింది. వీరు స్థానికంగా అందుబాటులో ఉండి గతంలో కంటే మిన్నగా రైతుల అవసరాలు తీరేలా పనిచేస్తున్నారు.

ఈ–క్రాప్ నమోదుపై శ్రద్ధ

ఈ–క్రాప్ నమోదు విషయంలో వీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో విపత్కర పరిస్థితుల్లో రైతులకు ప్రభుత్వం అందించే సహాయ, సహకారాలు సక్రమంగా అందేలా వీఏఏ, వీహెచ్ఏలు పనిచేస్తున్నారు. అదేవిధంగా పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు కూడా వీరు తగిన చర్యలు తీసుకుంటున్నారు. రైతుమిత్ర గ్రూపు ఏర్పాటు, సీసీఆర్సీ కార్డుల పంపిణీ, వైఎస్సార్ యంత్రసేవా పథకంలో ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్ల పంపిణీ, క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లింపు తదితర పనులను ఆర్బీకేల పరిధిలోనే కొనసాగిస్తున్నారు.

సాగువిధానం, పంట మార్పిడికి శ్రీకారం

వ్యవసాయ రంగంలో విప్లవాత్మకంగా మార్పులకు ఆర్బీకేల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక ఆర్బీకేను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మేలిరకమైన, అధిక దిగుబడి వచ్చే విధంగా పైర్లు సాగువిధానంలో మార్పునకు, పంట మార్పిడికి శ్రీకారం చుట్టింది. 2023–24 ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలిట్స్లో భాగంగా ఒక్కో ఆర్బీకే పరిధిలో ఒక్కో రకం పైరును ప్రయోగాత్మకంగా ఈ ఏడాది సాగు చేశారు. గంపలగూడెం మండలం కొణిజెర్ల ఆర్బీకేలో ఈ ఏడాది కందిపంటలో కొర్రలు అంతర పంటగా సాగు చేశారు. కొర్రల సాగు ఈ ప్రాంతంలో కొత్తగా చేపట్టారు. గ్రామానికి చెందిన మోదుగు బాలకృష్ణ 0.55 ఎకరాల విస్తీర్ణంలో కందిలో కొర్రలు అంతరపంటగా సాగు చేశారు. ఎల్ఆర్జీ–52రకం కంది, ఎస్ఐఏ–3156 రకం కొర్రలను ఈ ఏడాది జూలై 12వ తేదీన సాగుచేశారు. 5:1 నిష్పత్తిలో కంది, కొర్రల సాళ్లతో సాగుచేశారు. పంటకాలం 75 నుంచి 80 రోజులు. బెట్ట పరిస్థితుల్లో కూడా కొర్రలు తట్టుకుని దిగుబడి ఇస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు. నూతన పంటలను ప్రోత్సహిస్తూ అవసరమైన విత్తనాలను కూడా ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసింది.



కొణిజెర్లలో సాగుచేసిన హైడెన్సిటీ పత్తి



కొణిజెర్లలో ఆర్బీకే భవనం

హైడెన్సిటీ పత్తిసాగు

ఇదే ఆర్బీకే పరిధిలో పంటకాలం, పెట్టుబడి తక్కువలో దిగుబడి వచ్చే హైడెన్సిటీ పత్తి కూడా సాగుచేశారు. కుంటముక్కల ప్రభాకరరావు 1.38 ఎకరాల విస్తీర్ణంలో అధిక సాంద్రత పత్తి (హైడెన్సిటీ కాటన్) సాగుచేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ప్రతి కుదురుకు రెండు విత్తనాల చొప్పున ఎకరానికి 17,76 మొక్కలు వచ్చే విధంగా జూన్ 24వ తేదీన సాగుచేశారు. పంటకాలం సాధారణ రకం ఆరునుంచి ఎనిమిది నెలలు కాగా ఈ రకం 150 రోజులు. దీంతో తదుపరి రెండో పంటగా ఆరుతడి పైర్లను(పెసర, మొక్కజొన్న) వేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈపత్తి పైరు పూత, పిందె దశలో ఉంది. ఈ రెండు పైర్ల విషయమై స్థానిక రైతాంగానికి వ్యవసాయాధికారి బీ సాయిశ్రీ పర్యవేక్షణలో వీఏఏలు పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్బీకేల ద్వారా విశిష్ట సేవలు



రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుచేసిన తర్వాత రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. రైతులకు అవసరమైన అన్ని వసతులు కూడా ఆ కేంద్రాల ద్వారా, సిబ్బందితో కల్పిస్తున్నాం. ఆర్బీకేల పరిధిలో కొత్తరకం పైర్లసాగుతో రైతులను ప్రోత్సహిస్తున్నాం. దీంతో పంటమార్పిడికి అవకాశం ఉంది. కొత్తవంగడాలు, విత్తనాల సాగుతో రైతుల్లో అవగాహన, మెరుగైన ఉత్పత్తి లభిస్తాయి.

– బీ సాయిశ్రీ, వ్యవసాయాధికారి, గంపలగూడెం

'మాబిడ్డ కిడ్నీ ఆపరేషన్కు సహకరించండి'



కిడ్నీ ఆపరేషన్కు దాతలు ముందుకు రావాలని కోరుతున్న వెంకటరావు, శివమ్మ దంపతులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రెండు కిడ్నీలు పాడైన తమబిడ్డ వైద్యానికి దాతలు సహకరించాలని కొండపల్లికి చెందిన వెంకటరావు, శివమ్మ దంపతులు తమ ఆవేదన సోమవారం వ్యక్తం చేశారు. స్థానికంగా నివాసం ఉంటూ మాంసం దుకాణంలో రోజువారీ కూలితో జీవించే వీరి రెండోబిడ్డ రెండు కిడ్నీలు పాడవడంతో ఆందోళనకు గురయ్యారు. వెంకటరావుకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు నరసింహ మాంసం దుకాణంలో పనిచేస్తాడు. ఎటువంటి చెడు అలవాట్లు లేని నరసింహ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆ సమయంలో వైద్యులు కిడ్నీ పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పాడైనట్లు గుర్తించారు. డయాలసిస్ చేయాల్సిన స్థితిలో సొంత ఖర్చుతో కొన్ని రోజులు చేయించారు. ఆర్థికభారం పెరగడంతో డయాలసిస్ చేయడం కష్టంగా మారింది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కార్డుపై వారానికి మూడు డయాలసిస్లు చేయిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు చెప్పడంతో వయస్సులో ఉన్న కుమారుడికి కిడ్నీ ఇచ్చేందుకు తల్లిదండ్రులు వైద్యపరీక్షలు చేయించారు. తండ్రి కిడ్నీ నమూనాలు సరిపోయాయి. అయితే ఆపరేషన్కు అయ్యే ఖర్చు భరించలేని ఆ కుటుంబం దాతల సాయాన్ని కోరుతుంది. ఆపరేషన్కు సహకరించే దాతలు 79930 20857లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి వేడుకలు

ఇబ్రహీంపట్నం: మహాలక్ష్మి అమ్మవారి వేడుకలు ఇబ్రహీంపట్నంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పరిరక్షణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు ఉప్పతల వెంకటలక్ష్మి గ్రామదేవతకు పూజలు నిర్వహంచారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, దుర్గాప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

'న్యాయమే గెలిచింది'

మైలవరం: ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని, అవినీతి ఓడిపోక తప్పదని చంద్రబాబు విషయంలో తేటతెల్లమైందని జీ.కొండూరు జెడ్పీటీసీ సభ్యుడు జక్రధరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి స్కాంలో ఇరుక్కున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు 14రోజులు రిమాండ్ విధించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించడం అవినీతి ఓడిపోక తప్పదని రుజువైందని పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్లో 13 మందికి జైలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు 3వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించిన వాహనచోదకులును పోలీసులు అరెస్టు చేసి సోమవారం రైల్వే న్యాయస్థానంలో హాజరుపరిచారు. దీనిపై న్యాయమూర్తి కె.సురేష్ బాబు 13 మందికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

కనిపించని బంద్ ప్రభావం



నూజివీడు పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్లో తెరుచుకున్న దుకాణాలు



ఇబ్రహీంపట్నంలో బంద్ ప్రభావంపై ఆరా తీస్తున్న డీసీపీ విశాల్గున్ని పక్కన ఏసీపీ హనుమంతరావు



నూజివీడు బస్టాండు వద్ద తిరుగుతున్న విజయవాడ నాన్స్టాప్ బస్సులు



మైలవరంలో తెరచి ఉంచిన షాపులు, యథావిధిగా నడుస్తున్న ఆర్టీసీ బస్లు



చాట్రాయి సెంటర్లో తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు

నూజివీడు: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్ ప్రభావం నూజివీడులో కనిపించలేదు. వేకువజాము నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు యథావిధిగా నడిచాయి. విజయవాడ, తిరువూరు, ఏలూరు, గుడివాడ, మచిలీపట్నం తదతర ప్రాంతాలకు చెందిన సర్వీసులన్నీ రాకపోకలు సాగించాయి. హోటళ్లు, అన్ని రకాల దుకాణాలు, వ్యాపారసంస్థలు, పెట్రోలు బంకులు తదితరవన్నీ తెరుచుకున్నాయి. సినిమాహాళ్లలో సినిమాలను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పనిచేయగా, ప్రైవేటు పాఠశాలలకు మాత్రం ముందుగానే యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి. బస్టాండు వద్ద ఆందోళనలు చేయడానికి ప్రయత్నించిన టీడీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్స్టేషన్కు తరలించారు. ఉదయం 11.30 గంటల సమయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు నేతృత్వంలో బస్టాండు వద్ద ఆందోళనకు దిగగా పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి తక్షణమే వారందరిని అరెస్టు చేసి పోలీస్స్టేషన్కు తరలించారు. డీఎస్పీ ఈడే అశోక్కుమార్తో పాటు పట్టణ సీఐ, ఎస్సై–1, ఎస్సై–2, ట్రాఫిక్ ఎస్సైలు ఎంవీవీఎస్ఎన్ మూర్తి, శివనారాయణ, వెంకటేష్, శాగం రాధాకృష్ణారెడ్డి ప్రధాన రహదారులపై గస్తీ తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. కొందరు టీడీపీ కార్యకర్తలు జడ్పీ బాలికల హైస్కూల్ను మూయించేందుకు ప్రయత్నించగా పట్టణ ఎస్సై–2 వెంకటేష్ అడ్డుకుని పిల్లలందరినీ లోపలికి పంపించి పాఠశాల నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

మైలవరంలో..

మైలవరం: మైలవరంలో టీడీపీ నాయకులు సోమవారం ఇచ్చిన బంద్ పిలుపు ప్రభావం అంతగా లేదు. వర్తక, వ్యాపారులు యథావిధిగా తమ దుకాణాలు తెరచి కార్యకలాపాలు కొనసాగించారు. ఆర్టీసీ బస్ సర్వీస్లు కొనసాగాయి. ఎక్కడా అంతరాయం కలుగలేదు. విద్యా సంస్థలు బంద్లో పాల్గొనలేదు. ఆటోలు, కార్లు నడిచాయి. స్వచ్ఛందంగా బంద్కు సహకరించి షాపులు మూస్తే అభ్యంతరం లేదని, అయితే టీడీపీ నాయకులు బలవంతంగా షాపులు మూయిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: స్కిల్ డవలప్మెంట్ స్కాంలో మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో టీడీపీ బంద్ ప్రభావం ఇబ్రహీంపట్నంలో కనిపించలేదు. ఉదయం నుంచి బస్సులు, ఇతర వాహనాలు 65, 30వ నంబర్ జాతీయ రహదారులపై యథావిధిగా తిరిగాయి. దుకాణాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు పనిచేశాయి. ఇది ఇలా ఉండగా శాంతిభద్రతల పరిరక్షణ, బంద్ పరిస్థితిని డీసీపీ విశాల్ గున్ని పరిశీలించారు. ప్రజలకు ఆటంకం కలిగించే చర్యలపై ఉపేక్షించవద్దన్నారు. ఏసీపీ హనుమంతరావు, సీఐ పి.శ్రీనుకు పలు సూచనలు చేశారు. ఎస్ఐలు విజయలక్ష్మి, మణి పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని రిమాండ్కి తరలించినందుకు నిరసనగా సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్కి స్పందన లేదు. ఉదయం నుంచి మండలంలోని పోలవరం, చనుబండ గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు దుకాణాలను మూయించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూయించంబోతుతండడంతో పోలీసులు అడ్డుకుని పాఠశాలలను నడిపించారు. సత్తుపల్లి విజయవాడ, నూజివీడు, చింతలపూడి ఆర్టీసీ బస్సులు, ఆటోలు, లారీలు యథావిధిగా తిరిగాయి.

అవినీతికి పాల్పడినందుకే చంద్రబాబు అరెస్ట్

ఎమ్మెల్యే రక్షణనిధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమార్జనకు పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని సీఐడీ అరెస్టు చేయడంలో తమ ప్రభుత్వానికి ఎటువంటి కక్షసాధింపు ధోరణి లేదని ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేతలు చంద్రబాబునాయుడు అరెస్టు వ్యవహారంలో ప్రభుత్వంపై బురదజల్లాలని ప్రయత్నించడం శోచనీయమన్నారు. స్కిల్ డెవలప్మెంట్ నిధుల దుర్వినియోగం చేసినట్లు ఆధారాలతో సహా నిరూపితమైన తర్వాతే సీఐడీ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సైతం బాబు అక్రమాలు బయటికి వస్తున్నాయన్నారు. నిరుద్యోగులు, పేదలు, రైతులను నిలువునా మోసగించిన చంద్రబాబుకు చట్టప్రకారం శిక్ష తప్పదన్నారు. ఆయనకు కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తే టీడీపీ నేతలు నిరసన ప్రదర్శనలు, బంద్లు చేస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తప్పుపట్టడం శోచనీయమన్నారు. సమావేశంలో తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, ఏకొండూరు జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వర రెడ్డి, శామ్యూల్, గన్యా, విస్సన్నపేట ఎంపీపీ మెర్సీ వనజాక్షి, తిరువూరు నగరపంచాయతీ చైర్పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైఎస్సార్ సీపీ నాయకులు చలమాల సత్యనారాయణ, ఏరువ ప్రకాష్రెడ్డి పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



నూజివీడులో అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



గంపలగూడెంలో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: 'స్పందన'లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, ఏమాత్రం అలసత్వం చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్లోని పలు మండలాల ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో మొత్తం ఐదు అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పరిష్కరమవుతాయా, లేదా అనే విషయాలను సైతం ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఒకవేళ పరిష్కరించేందుకు వీలు కాకపోతే ఆ విషయాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్డీఓ వెంకటరత్నం, డీఎల్పీఓ సుందరి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ భాస్కరరెడ్డి, పీపీ యూనిట్ వైద్యాధికారి కేతేపల్లి గంగాధర కుమార్ పాల్గొన్నారు.

'స్పందన'లో రెండు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో రెండు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బంద్కు ఎమ్మార్పీఎస్ మద్దతు సిగ్గుచేటు

ఇబ్రహీంపట్నం: స్కిల్ డెవలప్మెంట్ అవినీతి కేసులో అరెస్ట్ అయిన చంద్రబాబుకు, టీడీపీ బంద్కు ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, జగనన్న అభిమాన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నాగమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో సోమవారం ఖండించారు. 2014లో మాదిగల మద్దతుతో అధికారంలోకి వచ్చి, వారిని అణగదొక్కేందుకు చంద్రబాబు ప్రయత్నించిన ఘటన గుర్తులేదా అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగను ప్రశ్నించారు. 2017లో కురుక్షేత్రం మహాసభ జరగనీయకుండా ఉద్యమకారులను అరెస్ట్చేసి అక్రమ కేసులు పెట్టినందుకు మద్దతిచ్చారా అని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ముసుగు తొలగించి టీడీపీ కండువా కప్పుకోవాలని హితవు పలికారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మందా కృష్ణమాదిగ మాయలో పడొద్దని పేర్కొన్నారు.

పాలబూత్పై టీడీపీ నాయకుల దాడికి యత్నం



జి.కొండూరులో పాలబూత్పై దాడికి యత్నిస్తున్న టీడీపీ నాయకులు

జి.కొండూరు: స్థానిక 14వ వార్డు మెంబరు పజ్జూరు నాగమల్లేశ్వరరావుకు చెందిన పాలబూత్పై టీడీపీ నాయకులు సోమవారం ఉదయం దాడికి యత్నించారు. ప్రజలకు నిత్యావసరమైన పాలను విక్రయించేందుకు పజ్జూరు నాగమల్లేశ్వరరావు జి.కొండూరు గుడి సెంటర్లో గల తన పాలబూత్ను సోమవారం తెల్లవారుజామున తెరిచాడు. కాగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో నిరసన తెలుపుతూ బంద్ను విజయవతం చేసేందుకు ర్యాలీగా వచ్చిన టీడీపీ నాయకులు పాలబూత్పై దాడికి యత్నించారు. ఈ క్రమంలో నాగమల్లేశ్వరరావుకు టీడీపీ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. వెంటనే సమాచారం అందుకున్న జి.కొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గొడవను అదుపు చేశారు.

భక్తవత్సలుడు శ్రీ మహావిష్ణువు



యతిరాజారావును సత్కరిస్తున్న యనమండ్ర వేంకటకృష్ణయ్య, పద్మనాభశాస్త్రి

విజయవాడ కల్చరల్: భక్తవత్సలుడు శ్రీ మహావిష్ణువు అని యతిరాజుల భాగవతార్ అన్నారు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159 జయంతి సందర్భంగా శిష్యప్రశిష్యులు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న హరికథా ఉత్సవాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. సోమవారం జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన పి.యతి రాజు పోతన భాగవతంలోని ధ్రువ చరిత్రను గానం చేశారు. ఆయన మాట్లాడుతూ ధ్రువుని తపస్సుకు మెచ్చిన విష్ణుమూర్తి బాలధ్రువునకు వరమిచ్చి ప్రజలకు మెచ్చేలా రాజ్య పాలన చేసి చివరి సమయంలో ఆకాశంలో ధ్రువుడు నక్షత్రంగా విశ్వమున్నంత సేపు ఉండాలని ఆశీర్వదించినట్లు తెలిపారు. జగిత్యాలకు చెందిన వి.నాగమణి శివలీలను, సప్తా భారతి పాదుకా పట్టాభిషేకం, జనగాంకు చెందిన షణ్ముఖ భాగవతారిణి మహిసాసురమర్ధని కథను శ్రావ్యంగా వినిపించారు. పాలపర్తి నాగేశ్వరరావు, పాణ్యం దక్షిణా మూర్తి, ఎం. నగధరరావు, టి.నాగేశ్వరరావు, కాపవరపు సుబ్బారావు వాద్యసహకారం అందించారు. హరికథా భాగవతులను యనమండ్ర కృష్ణయ్య, బుర్రా పద్మనాభశర్మ, సత్కరించారు.

వాహనం ఢీ.. వ్యాపారికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అతి వేగంగా వచ్చిన వాహనం ఢీ కొట్టడటంతో వ్యాపారి గాయపడిన ఘటన గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధర పురానికి చెందిన సీహెచ్ నాగరాజు.. కాశేశ్వరరావు మార్కెట్లో కూరగాయలు వ్యాపారి. సోమవారం ఉదయం మార్కెట్ నుంచి కూరగాయలు తీసుకొని రామవరప్పాడులో తెలిసిన దుకాణంలో కూరగాయలు వేసేందుకు వెళుతున్నారు. బీఆర్టీఎస్ రోడ్డు క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలోకి వచ్చే సరికి వేగంగా వచ్చిన చతుర్థ చక్ర వాహనం ఢీ కొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగరాజును ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుపై గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు కనిపించడం లేదని ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్):పార్కింగ్ చేసిన కారు కనిపించలేదంటూ గుణదల పోలీస్స్టేషన్లో కేసు నమోదైంది. గుణదల రామ్గోపాల్ థియేటర్ పక్క వీధిలో లంక రామకృష్ణ నివసిస్తున్నారు. ఆయనకు మారుతీ స్విఫ్ట్ కారు ఉంది. ఈ నెల 9 రాత్రి గుణదల స్వీట్ షాప్ పక్కన పార్కింగ్ చేశారు. 10వ తేదీ ఉదయం చూసేసరికి కారు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారు.